క్లుప్తంగా

నేడు నరసరావుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

నరసరావుపేట: జిల్లాలోని నరసరావుపేట పట్టణంలో గురువారం పదో వార్డు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరం నిర్వహిస్తున్నట్లు డీఎండీహెచ్‌వో డాక్టర్ బి.రవి బుధవారం వెల్లడించారు. పలువురు డాక్టర్లు హాజరై వైద్యపరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేస్తారన్నారు.

16న ఉపసర్పంచ్‌ల ఎన్నిక

నాదెండ్ల: నాదెండ్ల, ఇర్లపాడు గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నికలు ఈనెల 16న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి వార్డు సభ్యుల చేత ఉపసర్పంచ్ ఎన్నికల ఓటింగ్ జరుగుతుందన్నారు. నాదెండ్ల ఎన్నికల అధికారిగా ఎంఈవో ఆంజనేయులు, ఇర్లపాడు ఎన్నికల అధికారిగా ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ వ్యవహరించనున్నారు. నాదెండ్ల ఉపసర్పంచ్ రాజీనామా చేయగా, ఇర్లపాడు ఉపసర్పంచ్ మృతి చెందాడు. దీంతో ఖాళీగా ఉన్న రెండు పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

డిజిటల్ వ్యవస్థ ద్వారా ఆన్‌లైన్ సేవలు



బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శుల సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జాలానీబాషా మాట్లాడుతూ పంచాయతీలను ఆధునీకరించి డిజిటల్ ఆన్‌లైన్ సేవలు అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జి.శ్రీహరి, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నెలాఖరుకల్లా పూర్తిచేయాలి

నాదెండ్ల: నవంబర్ చివరి నాటికి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పూర్తి చేయించి పంచాయతీలు, గ్రామ సచివాలయాలకు స్వాధీనం చేయాలని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సిబ్బంది చూడాలన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడి మృతి



ఈపూరు: ద్విచక్రవాహనాన్ని ట్రాక్టరు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కొండ్రముట్ల గ్రామ సమీపంలోని కాల్వకట్టవద్ద జరిగింది. ఈపూరుఎస్సై ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం బోడిశంభుని గ్రామానికి చెందిన తానికొండ గాలెయ్య (65) ద్విచక్రవాహనంపై వెళుతుండగా ట్రాక్టరు ఢీకొట్టింది. ఈప్రమాదంలో గాలెయ్య మృతి చెందాడు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈపూరు పోలీసులు కేసునమోదుచేసుకుని దార్యప్తుచేస్తున్నారు.

యువకుడి దుర్మరణం



వినుకొండ(నూజెండ్ల): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వినుకొండ రూరల్ మండలం నీలగంగవరం అడ్డరోడ్డు వద్ద గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. సేకరించిన వివరాలప్రకారం బొల్లాపల్లిమండలం వెల్లటూరు గ్రామానికి చెందిన మేడిపల్లి శాయ్యేలు(28) నీలగంగవరం గ్రామంలో తన భార్యవద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా నీలగంగవరం నుంచి గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిలోకి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శాయ్యేలు అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న వినుకొండ పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యాశాలకు తరలించగా పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య కెజియాతోపాటు ఇరువురు సంతానం ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com

జగనన్న చేసిన మంచిని తెలియచేద్దాం

- నేటి నుంచి నియోజకవర్గంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం
- పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



పార్టీ కార్యాలయంలో నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలో గురువారం నుంచి ప్రతిరోజూ ఒక సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చారు. ఈ మేరకు ప్రకాష్‌నగర్ పార్టీ కార్యాలయంలో నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా జరుగుతున్న మంచిని ప్రజలకు తెలియచెప్పటమే దీని ఉద్దేశ్యమన్నారు. గ్రామాలకు ఎంత నగదు బదిలీ చేశాం, ఎంత మందికి మేలు జరిగిందో వివరించాల్సి ఉందన్నారు. గ్రామంలో వచ్చిన మార్పులు నాడు–నేడు రూపంలో తెలియజేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయంలో లబ్ధిదారుల వివరాలును ప్రదర్శించాలని, ఇటు రాష్ట్రం, పట్టణం, గ్రామంలో అభివృద్ధి చేస్తూనే సంక్షేమం పై దృష్టి పెట్టిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం చేసిన మంచి పనులన్నీ ప్రజలకు తెలియచేయాలని, సంక్షేమమే అభివృద్ధి అని తాము రుజువు చేశామన్నారు. చంద్రబాబు హయాంలో తలసరి ఆదాయంలో రాష్ట్రం 17వ స్థానంలో ఉంటే ఇప్పుడు 9వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లోనూ గత ప్రభుత్వం కంటే ఇప్పుడు అభివృద్ధి చెందామని ఆయన గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్రాభివృద్ధిని గణాంకాలే చెబుతున్నాయని అన్నారు. మ్యానిఫెస్టోను సీఎం జగన్ పవిత్ర గ్రంధంగా భావించారన్నారు. 2019లో జీఎస్‌డీపీలో ఏపీ 22వ స్థానంలో ఉంటే ఇప్పుడు ఒకటవ స్థానానికి చేరుకుందన్నారు. సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేర్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. పూర్తి పారదర్శక పాలనలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా లక్షల కోట్ల రూపాయలను పేద ప్రజల ఖాతాల్లోకి చేరాయన్నారు. అందుకే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

ఎన్నికల విధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



బీఎల్‌వోలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు

నాదెండ్ల: ఎన్నికల విధుల పట్ల బీఎల్‌వోలు అప్రమత్తంగా వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును డోర్ టు డోర్ విచారణ జరపాలని తహసీల్దార్ నాంపల్లి నాగ మల్లేశ్వరరావు చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేట ఎన్నికల అధికారి సూచనల మేరకు ఈ నెల 4,5 తేదిల్లో ప్రతి బూత్‌లో ప్రత్యేక డ్రైవ్ జరిగిందన్నారు. 88 దరఖాస్తులు వచ్చాయన్నారు. నూతన ఓటర్ల నమోదు, సవరణలు, తొలగింపులు తదితరాలతో పాటూ జీరో డోర్ నెంబర్లు ఉన్న వాటిని నిశితంగా పరిశీలించాలన్నారు. ఒకే డోర్ నెంబర్‌తో ఎక్కువ ఓట్లు కలిగిన వాటిని విచారించాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌వోలు విధులు నిర్వహించాలని, సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలి

యడ్లపాడు: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అధికారులందరూ విధిగా పాటించాలని తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు పేర్కొన్నారు. మండలంలోని బూత్ లెవెల్ అధికారులతో యడ్లపాడు–1 గ్రామ సచివాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో ఆయన మాట్లాడుతూ అధికంగా ఓటర్ల తొలగింపు జరిగిన చోట మొత్తం ఓటర్లు, జనాభా నిష్పత్తిని పరిశీలించాలని సూచించారు. ఎన్నికల విధులకు సంబంధించి సీఈవో నుంచి బీఎల్‌వోల వరకు ఎన్నికల నిబంధనల మేరకు పనిచేయాల్సి ఉందన్నారు. తమ విధుల పట్ల బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉంటూ, పెండింగ్ ఉన్న ప్రతిదరఖాస్తు క్షేత్రస్థాయి విచారణ చేసి తమ నివేదిక అందించాలని తెలిపారు. ముందుగా పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల తొలగింపులు, మార్పులు, చేర్పులను గ్రామాల వారీగా ఆయన సమీక్షించారు. అనంతరం తాజాగా నియోజకవర్గ స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలోని అంవాలను వారికి వివరించారు. సమీక్షలో ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు హాజరయ్యారు.

కరుణించిన వరుణుడు

రెండు మండలాల్లో వర్షం



శావల్యాపురంలో కంది పంట కళకళలాడుతున్న దృశ్యం

యడ్లపాడు: వేసవిని తలపిస్తున్న భానుడి ప్రతాపాన్ని తగ్గించేలా వరుణుడు కరుణించారు. అరగంట సేపు కుంభవృష్టిగా కురిసిన వానతో వాతావరణం చల్లబడి పంటపొలాలకు జవసత్వాన్ని అందించింది. వానాకాలం ప్రారంభమైనా ఎండలు మండుతూనే వచ్చాయి. రోజు 30 నుంచి 42 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు సైతం నమోదయ్యాయి. వరుణుడు దోబూచులాడటంతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. వివిధ పంటల్ని సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని నల్లమబ్బులు దాల్చడం, చలిగాలు వీయడం తప్ప ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. మండలంలోని లింగారావుపాలెం, సొలస, కొండవీడు తదితర గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ కొద్దిపాటి వర్షాలు కురిశాయి. బుధవారం రైతుల సుదీర్ఘ నిరీక్షణకు తెరదీస్తూ ఉరుములు, మెరుపులు, రివ్వున వీచే గాలులతో భారీ వర్షం కురిసింది. మండల కేంద్రమైన యడ్లపాడు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వాన కురిసింది. మూడు నెలల కాలంలో దాదాపు ఇదే భారీ వర్షంగా రైతులు చెప్పుకుంటున్నారు. మధ్యాహ్నం 2.45 నుంచి అర్ధగంట సేపు లావుపాటి చినుకులతో దంచికొట్టడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం అవుతుంది.

పిడుగు పాటు...

జగ్గాపురం గ్రామంలోని లైబ్రరీ పక్కనే ఉన్న పోపూరి వెంకటేశ్వరరావు నివాసంపై బుధవారం సాయత్రం పిడుగు పడింది. ఇంటిపై ఉన్న వాటర్ ట్యాంక్ అంచున పిడుగు ఘాతం తగలడంతో కొన్ని ఇటుకలు మాత్రమే పెచ్చులా ఊడిపోయాయి. ఇంటిలోని వారు పైకెళ్లి చూసి ఉలిక్కిపడ్డారు.

ఆరుతడి పంటలకు ప్రాణం పోసిన వర్షం

శావల్యాపురం: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం దాటికి ఆరుతడి పంటలకు ప్రాణం పోసినట్లు ఉందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 2100 ఎకరాలు కంది సాగు రైతులు చేశారు. కంది ఎదుగుదల సమయంలో సాగునీరు లేక బెట్టకు వచ్చిన తరుణంలో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడ రావని తీవ్రస్థాయిలో అందోళన చెందారు. దీంతోగత రెండు రోజుల నుంచి వర్షం పడటంతో పంటలకు ప్రాణం పోసినట్లు ఉందని రైతులు చెబుతున్నారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షం 20 రోజుల పాటు ఆరుతడి పంటలకు మేలు చేస్తుందన్నారు. వర్షం నమోదు పెరిగితే శనగ పంటకు సాగుకు రైతులు చేసుకోవచ్చునన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

చిలకలూరిపేటటౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం ఎస్ రాంబాబు చెప్పారు. ఈ నెల 10 తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ డీఎం కార్యక్రమం ఉంటుందన్నారు. ఆర్టీసీ డిపో పరిధిలోని అన్ని మండలాల ప్రయాణికులు తగు సూచనలు, సలహాలు 9959225427 నంబర్‌కు తెలియజేయాలన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు కేబీఆర్ విద్యార్థి



నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు కాసు బ్రహ్మానందరెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థి కె.మల్లిఖార్జున ఎంపికైనట్టు కె.బి.ఆర్. విద్యాసంస్థల ప్రిన్సిపల్ సిహెచ్.వి.నాగిరెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 7వ తేదీన అచ్చంపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–19 కుస్తీ ఎంపిక పోటీలలో మల్లిఖార్జున 60 కేజీల (గ్రీకో రోమన్ స్టైల్) విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఎంపికైనట్టు వివరించారు. కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ ఎ.వెంకటశివ, పిడి ఎం.విసీల్ మల్లిఖార్జునను అభినందించారు.

వేరుకుళ్లు తెగులుతో అప్రమత్తంగా ఉండాలి



నరసరావుపేట రూరల్: మిరపలో వేరుకుళ్లు తెగులు నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పమిడిపాడు గ్రామంలో మిరప పంటను బుధవారం ఆయన పరిశీలించారు. వేరుకుళ్లు తెగులు మొక్కలకు ఆశించడాన్ని గమనించి రైతులకు నివారణ చర్యలు తెలియజేశారు. బెట్టవాతావరణంలో నీరు పారించడం వలన వేరు కుళ్లు తెగులు ఆశిస్తుందని తెలిపారు. దీని నివారణకు లీటరు నీటికి రెండు మి.లీ రెడోమిల్, వారం తరువాత ట్రైకోడేర్మా విరిడి పశువుల ఎరువుతో కలిపి పొలములో చల్లడం ద్వారా వేరుకుళ్లును నివారించవచ్చని వివరించారు. మొక్కలకు పైపాటుగా పోషకాలు అందించాలని తెలిపారు. లీటరు నీటికి 19–19–19 ఐదు గ్రాములు, ఫార్ములా–4 ఐదు గ్రాములు, 13–0–45 ఐదు గ్రాములు చొప్పున లీటరు నీటితో కలిపి పిచికారీ చేయడం ద్వారా మొక్కలు ఎండను తట్టుకుంటాయని తెలియజేశారు.

శివప్రియనగర్ రిజర్వు సైట్ ఆక్రమణపై ఫిర్యాదు

క్షేత్రస్థాయిలో పరిశీలించిన పోడా అధికారులు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న పోడా వైస్‌చైర్మన్ శ్రీనివాసరెడ్డి, డీపీవో గురవారెడ్డి

నాదెండ్ల: గణపవరం శివప్రియ నగర్‌ను బుధవారం నరసరావుపేట పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పోడా) అధికారులు సందర్శించారు. 1998లో శివారెడ్డి అనే వ్యాపారి 25 ఎకరాల విస్తీర్ణంలో రియల్ ఎస్టేట్ వెంచర్ వేశాడు. అప్పట్లో అనుమతుల కోసం అధికారులకు దరఖాస్తులు చేసుకోగా, ప్లానులో 2.5 ఎకరాల భూమిని రిజర్వు సైటుగా వదిలారు. ప్రస్తుతం ఈ వెంచర్‌లోని రిజర్వు సైట్‌ను కొందరు వ్యక్తులు దున్ని వ్యవసాయం చేసుకుంటున్నారంటూ చిలకలూరిపేటకు చెందిన పేలూరి రామారావు, పి.శ్రీనివాసరావు, షేక్ కాలేషా, సత్యనారాయణరాజు, శ్రీనివాసరాజులు ఈనెల 4న పోడా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోడా వైస్ చైర్మన్ గజ్జెల శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా ప్రణాళికా అధికారి గురవారెడ్డి, జేపీవో రఘు, పంచాయతీ కార్యదర్శి అర్వపల్లి శేఖర్‌లు ప్లానును పరిశీలించారు. రిజర్వు భూమిని ఫీల్డ్‌లో గుర్తించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. నాదెండ్ల తహసీల్దార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి గ్రామ సర్వేయర్ల సహకారంతో రిజర్వు ల్యాండ్‌ను గుర్తించి కంచె వేయాలని సూచించారు. ప్రస్తుతం ఈ రిజర్వు ల్యాండ్‌ను ఆక్రమించుకున్న వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.

విజయాలను సొంతం చేసుకోవాలి



నెట్‌బాల్ జిల్లా జట్లతో ఏఎంజీ సీఏవో మాశిలామణి, ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: ఉత్తమ ప్రతిభచూపి విజయాలను సొంతం చేసుకోవాలని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ సీఏవో బి.మాశిలామణి చెప్పారు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ –17 బాల, బాలికల జట్లకు ఏఎంజీ హైస్కూల్ ప్రాంగణంలో గత నాలుగు రోజులుగా శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా నెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక ప్రక్రియ కొద్ది రోజుల కిందట పాఠశాల ప్రాంగణంలో నిర్వహించినట్లు తెలి పారు. ఒక్కో జట్టుకు 12 మంది చొప్పున 24 మంది విద్యార్థులు గత నాలుగు రోజులుగా ఇక్కడ శిక్షణ పొందినట్లు వివరించారు. ఈ విద్యార్థులు గురువారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో గెలుపొంది ఉమ్మడి గుంటూరు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కె.కృపాదానం, కోచ్‌లు షేక్ ఖాశింబుడే, కె.రాజు, మేనేజర్ సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్యంలో వివాహాలు అనర్థం

బాల్య వివాహాలు భావితరాలకు ఉరితాళ్లు కరపత్రం ఆవిష్కరణ



ఐసీడీఎస్ కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరిస్తున్న పీడీ అరుణ, డీబీఆర్‌సీ ప్రతినిధులు

నరసరావుపేట: బాల్యంలో పెళ్లిళ్లు భావితరాలకు ఉరితాళ్లు, 'బాల్య వివాహాలు అంతం చేద్దాం' అనే కరపత్రాన్ని ఐసీడీఎస్ పీడీ బి.అరుణ ఆవిష్కరించారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వం చట్ట ప్రకారం ఆడపిల్లలకు 18 ఏళ్ల లోపు, మగ పిల్లవాడు 21 ఏళ్లలోపు ఉన్నవారికి వివాహాలు చేయటం బాల్య వివాహాలుగా గుర్తించిందని, అవి చేయటం చట్టరీత్యా నేరమని పేర్కొందన్నారు. పిల్లలను చదివించి తల్లిదండ్రులు సరైన నిర్ణయాలు తీసుకోవాలని, పిల్లలు మానసికంగా ఎదగటం ముఖ్యమన్నారు. ప్రధానంగా ఆడపిల్లలు రక్తహీనత వలన అవయవాలు సరిగ్గా లేని బిడ్డలకు జన్మనివ్వడం, మాతృ మరణాలు, లైంగిక వ్యాధులు, గర్భస్రావం లాంటివి జరగకుండా ఉండాలంటే బాల్య వివాహాలు చేయరాదని చెప్పారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ఐసీడీఎస్ డీసీపీవో విజయ్ కుమార్, ఎల్‌సీపీవో వాసంతి, డీపీవో సత్యనారాయణ, పాల వేణు, మేడే వెంకటరమణ, గడ్డిపర్తి కోటి రత్నం పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స చేయడం అందరికీ తెలిసి ఉండాలి

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం ప్రారంభించిన డాక్టర్ రామలింగారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్లు రామలింగారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట: ప్రథమ చికిత్స, బేసిక్ లైఫ్ సపోర్ట్ అనేది ప్రతి మనిషి జీవితంలో తప్పనిసరని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఏఎంఆర్ సూపర్‌స్పెషాల్టీ, డెంటల్ హాస్పిటల్ సిబ్బందికి బేసిక్ లైఫ్ సపోర్టు అనే అంశంపై ఏర్పాటుచేసిన ఒక రోజు శిక్షణకు ముఖ్యఅతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు అతడిని హాస్పిటల్‌కు తీసుకువచ్చేలోపు ప్రథమ చికిత్స అందించడం వల్ల అతని ప్రాణాన్ని కాపాడవచ్చు అన్నారు. అదేవిధంగా ప్రతి వ్యక్తి సీపీఆర్‌లో శిక్షణ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా శిక్షణ కార్యక్రమాలు కళాశాలలు, కర్మాగారాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో బ్యాచ్‌ల వారిగా నిర్వహిస్తమని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్ మంజూరు చేస్తామన్నారు. పాల్గొనదలచిన వారు 91000 78576 నంబర్ సంప్రదించాలని కోరారు. డాక్టర్లు పి.రామ్మోహన్‌రెడ్డి, నవులూరి క్రాంతికుమార్‌రెడ్డి, వంశీనాథ్ రెడ్డి శిక్షణను అందజేసి పాల్గొన్న వారికి ధృవపత్రాలు అందజేశారు. రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి మురళీకృష్ణ, డెంటల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ మేకల చంద్ర కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యడ్లపాడు మండల సమావేశం

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ పిడతల ఝాన్సీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు.

నేటితో ముగియనున్న ప్రతిష్ఠా మహోత్సవాలు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో నూతన దేవాలయాలు ప్రతిష్ఠా వేడుకల్లో భాగంగా పోలేరమ్మ, కనకమ్మ,పెద్దమ్మ, మహాలక్ష్మమ్మ,అద్దంకమ్మ గ్రామ దేవతలు ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా నేటితో ముగుయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో ముప్పాళ్ల విద్యార్థుల ప్రతిభ

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచారు. ఈ నెల 6,7 తేదీల్లో చోడవరం ఆర్‌వీఆర్‌జీ జేసీ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్ మహిళా విభాగం పోటీల్లో విద్యార్థినుల జట్టు ప్రథమస్థానం సాధించగా పురుషుల విభాగంలో విద్యార్థుల జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు తెలిపారు. విజయం సాధించిన ఇరు జట్లను ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్రావుతో పాటు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరి రావు, అధ్యాపకులు ఆర్.బలరాంనాయక్, ఎం.సురేష్‌కుమార్, ఎం.దాస్‌లు అభినందించారు.

నేడు సంకురాత్రిపాడులో జగనే ఎందుకు కావాలి కార్యక్రమం

నాదెండ్ల: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం గురువారం నుంచి సంకురాత్రిపాడు గ్రామంలో ప్రారంభమౌతుందని వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి చెప్పారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణి, సర్పంచ్ జెట్టి నాగమణితో పాటూ గ్రామ నాయకులు, పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు హాజరుకావాలన్నారు. ముందుగా పంచాయతీ కార్యాలయంలో నాయకులతో సమావేశమై అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ, మెటీరియల్ పంపిణీ జరుగుతుందన్నారు. అదేగ్రామంలో రాత్రి బస చేసి ఉదయాన్నే పలు కాలనీల్లో పర్యటిస్తారని తెలిపారు. 10వ తేదీన గొరిజవోలు, 14న చందవరం, 15న సాతులూరు, 16న కనపర్రు, 17న ఇర్లపాడు, 20న ఎండుగుంపాలెం, 21 నాదెండ్ల, 22న తూబాడు, 23న చిరుమామిళ్ల గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు.

పాముకాటుకు గురై మహిళ మృతి

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో పాము కాటుకు గురై కోడూరి మంగమ్మ (42) బుధవారం మృతి చెందింది. మొక్క జొన్న పొలంలో పనులు నిర్వహిస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. మంగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు.

